అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో మంగళవారం సీఎం పర్యటన సందర్భంగా ఓర్వకల్లు విమానాశ్రయాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఉదయం 11.40 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఓర్వకల్లు ఎయిర్పోర్టు నుండి బయలుదేరి మధ్యాహ్నం 1.05 గంటలకు పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారన్నారు. పెన్షన్ పంపిణీ, గ్రామ సభ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం మధ్యాహ్నం 3.35 గంటలకు పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుండి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు కర్నూలు ఎయిర్పోర్ట్ చేరుకుంటారని, సాయంత్రం 4.10 గంటలకు కర్నూలు ఎయిర్పోర్ట్ నుండి బయలుదేరి సాయంత్రం 5 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఇతర ఏర్పాట్లను చూసుకోవాలని ఎయిర్పోర్ట్ డైరెక్టర్, కర్నూలు ఆర్‌డిఒలను కలెక్టర్ ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి పాల్గొన్నారు.

సిఎం సారూ..ఇటు చూసేరా..?

- జిల్లాను వేధిస్తున్న అనేక సమస్యలు - నేడు జిల్లాలో సిఎం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఏళ్ల కాలంగా సమస్యలు తిష్ట వేశాయి. జిల్లా వాసులకు అనేక తిప్పలు తప్పడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం పత్తికొండ మండలం పుచ్చకాలయమాడలో పింఛన్ల పంపిణీలో పాల్గొనున్నారు. గ్రామస్తులతో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

తప్పని వలస వెతలు : ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊళ్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబయిలకు తరలి వెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6 వేల కుటుంబాలు వలస బాట పట్టాయి. ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు : కరువుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హోసళ్లి, సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలను అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.

సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్రం : జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టి పీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగునీరు నేలపై పారుతున్నాయి. నగర జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది.

సాగు, తాగునీటికి తిప్పలే : ఆలూరు నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారు. సాగునీరు లేకపోవడం, సకాలంలో వర్షాలు లేక రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. తాగు నీటి కోసం ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి నుంచి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతోంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుంచి 20 రోజులకు నీరు అందిస్తారు. నీటి సమస్య పరిష్కారానికి వామపక్షాల పోరాటంతో చిప్పగిరి మండలంలో 2008లో నగరడోన రిజర్వాయర్‌కు వైఎస్.రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి వదిలేశారు. దానితో పాటు హాలహర్వి మండలంలోని వేదవతి రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కొరత : కర్నూలు జిల్లా చుట్టూ అనేక విద్యాసంస్థలు ఉన్నప్పటికీ వాటి నిధుల కొరతతో అభివృద్ధి చెందడం లేదు. రాయలసీమ విశ్వ విద్యాలయంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఇక్కడ అనేక విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసి ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.500 కోట్ల నిధులను కూడా కేటాయిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థులు కోరుతున్నారు.

సిఎం భద్రత ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్టోబర్ 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సంధర్భంగా పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయప్రవీణ్ , కర్నూలు జిల్లా ఎస్పి జి. బిందు మాధవ్ సోమవారం పరిశీలించారు. హెలీ ప్యాడ్, సభా ప్రాంగణం, సిఎం కాన్వాయ్ రిహార్సల్స్ , పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఎక్కడికక్కడ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పుచ్చకాయలమాడలో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసే గృహాల వద్ద కర్నూలు రేంజ్ డిఐజి, జిల్లా ఎస్పి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిలు వెంకట్రామయ్య, రామాంజినాయక్, సోమన్న, సిఐలు, ఎస్ఐలు ఉన్నారు.

సిసిఐ ద్వారా
పత్తిని కొనుగోలు చేయాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పత్తికి క్వింటాలుకు రూ.10వేలతో సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బందం సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వినతి పత్రం సమర్పించారు. జి.రామకష్ణ,జిల్లా ఉపాధ్యక్షుడు మాజీ సర్పంచి ఆంజనేయులు, ఈ తాండ్రపాడు సర్పంచి బాలపీరా, రైతు సంఘం నాయకులు దస్తగిరి ఉన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమైన పంట పత్తి సుమారుగా రూ.రెండు లక్షలకు ఎకరాలకు పైగా సాగు చేస్తారని, రూ.50 వేలకు పైగా రైతాంగం పెట్టుబడి పెడుతున్నారని, ఖర్చులు పెరిగి గిట్టుబాటు రాక అప్పులపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. పత్తి పండించడం అనేక ఇబ్బందులతో కూడుకున్న పరిస్థితిని ఎరువులు పురుగుమందులు నకిలీ విత్తనాలు అనేక రకాలుగా సమస్యలను రైతులు ఎదుర్కొంటున్నారన్నారు మార్కెట్కు వచ్చిన తర్వాత రైతుల యొక్క అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వ్యాపారస్తులు సిండికేట్ గా మారి అత్యంత తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నరన్నారు. గత సంవత్సరం వర్షాలు లేక పంటలను పాసి వేసిన పరిస్థితి ఉందని అటు పోయిన సంవత్సరం నకిలీ విత్తనాలతో పంట దిగుబడి రాక నష్టపోయారన్నారు. ఈ సంవత్సరం కొంత పంట చేతికి వచ్చినప్పటికీ మార్కెట్ మాయజాలంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆదోని మార్కెట్లో గత కొన్ని రోజులుగా రూ.10,000 ఉన్నప్పటికీ సడన్‌గా రూ.6000, రూ.7000 రూపాయలు పడిపోయిందన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఆదోని మార్కెట్లో జరిగే అవకతకులపై విచారణ జరిపించాలన్నారు. జాయింట్ కలెక్టర్ నవ్య స్పందిస్తూ ఇప్పటికే కొనుగోలను బంద్ చేశామని, రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

నిరుపేదలకు మెడికల్ విద్యా దూరం

- పిసిసి మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నిరుపేద విద్యార్థులకు మెడికల్ విద్య అందకుండా రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మెడికల్ కళాశాలన్నింటిని ప్రైవేటుపరం చేశారని పిసిసి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ విమర్శించారు. సోమవారం కర్నూలుకు వచ్చిన ఆయన కర్నూలు డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలును అటకెక్కించారని, తిరుమలలడ్డు ప్రసాదంతో పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. మతం పేరుతో కులం పేరుతో రాజకీయాలు చేయకూడదన్నారు. కర్నూలులో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీని విజయవాడకు తరలించకూడదన్నారు.డిసిసి అధ్యక్షుడు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన గాడితప్పిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే అంశాలను తెరపైకి తెస్తూ చంద్రబాబు పాలన సాగుతుందని విమర్శించారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష, మాజీ డిసిసి అధ్యక్షులు కె,బాబురావు, కాంగ్రెస్ నాయకులు ఎన్‌సి బజారన్న, అనంతరత్నం, ఈ లాజరస్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు - కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడమే కాకుండా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, అధ్యక్షతన జరిగిన ధర్నానెద్దేశించి ఎం.డి అంజిబాబు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుందన్నారు. కానీ వారి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తర్వాత కాంట్రాక్టు కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని. కాని ఇప్పటికీ చెల్లించడం లేదన్నారు. జిల్లాలో అనేక ప్రైవేట్ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, కనీస అవసరాలకు కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు రంగంలో అనేకమంది కాంట్రాక్టర్ రంగంలో పనిచేస్తున్నారని వారికి కనీసమైన అవసరాలు వసతులు కూడా కల్పించడం లేదన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు హమాలి రంగానికి పీస్ రేటు విధానం రద్దుచేసి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ప్రభాకర్, నాగరాజు, సాయిబాబా, విజయ్, నగర నాయకులు నరసింహులు, రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు రాముడు, మోహన్‌ఆటో వర్కర్ యూనియన్ నాయకులు రాధాకృష్ణ, మెహమూద్ షంషేర్ త్యాగరాజుమెడికల్ అండ్ హెల్త్ రంగం నాయకురాలు రవినాజ్యోతి, ఎపిఎస్ఆర్‌టిసి యూనియన్ నాయకులు శ్రీనివాసులు , ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ యూనియన్ నాయకులు దేవరాజు, సమగ్ర శిక్ష ఉద్యోగ జెఎసి చైర్మన్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

రెండో రోజు సిబిఎస్ఇ ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : కర్నూలు లక్ష్మీపురంలోని క్రిడ్జ్ పాఠశాలలో బివిడిఎస్ఇ క్లస్టర్ సెవెన్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల బాలుర ఫుట్బాల్ పోటీలును రెండో రోజు కూడా నిర్విరామంగా కొనసాగాయి. పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులు నువ్వా నేనా అన్నట్లుగా ప్రత్యర్థులతో తలపడుతూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు.సోమవారంనాటి పోటీలలో అండర్14 విభాగంలోఎడిఫై వరల్డ్ స్కూల్ అత్తాపూర్ హైదరాబాద్, శ్లోక ఏ బిర్లా స్కూల్ నల్గొండ జిల్లా, శ్యామ్‌రాజ్ స్కూల్ కష్ణాజిల్లా, జట్లువిజయం సాధించాయి. అండర్17 విభాగంలో రెయిన్ బోస్కూల్ నెల్లూరు, శ్రీ స్వామి నారాయణ గురుకుల్ విద్యాలయ హైదరాబాద్, మాంటిసోరి స్కూల్ కర్నూల్ జట్లు విజయం సాధించాయి. అండర్ 19 విభాగంలో కాకతీయపబ్లిక్‌స్కూల్ విశాఖపట్నం, ఇండస్‌యూనివర్సల్‌స్కూల్ రంగారెడ్డి జిల్లా, చిన్మయ విద్యాలయ హైదరాబాద్ జట్లు విజయం సాధించి తదుపరి పోటీలకు అర్హత సాధించాయని పాఠశాలసిఇఒ గోపినాథ్ తెలిపారు. ఫుట్‌బాల్ పోటీలను కార్యదర్శి డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజకమల్, గ్లోబల్ స్కూల్ సిఇఒవంశీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం జరగబోయే అండర్ 19 క్వార్టర్ ఫైనల్స్ పోటీలను రాష్ట్ర మంత్రిటిజి.భరత్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

అభాగ్యుల సేవలో హ్యాపీ ఏడిస్ హ్యాండ్స్ సేవా సమితి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అనాధలు అభాగ్యుల సేవలో హ్యాపీఏడిస్ హాండ్స్ సేవా సంస్థ ప్రతినిధులు తమ అమూల్యమైన సమయాన్ని కేటాయిస్తున్నారు. ఈ సంస్థలో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నవారు సభ్యులుగా ఉండటం విశేషం. వారు సెలవు దినాలలో నగరంలోని, నగర పరిసర ప్రాంతాలలోని అభాగ్యులను అనాధలను గుర్తించి వారికి శుభ్రత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. వారు స్వశక్తితో వ్యక్తిగత పరిశుభ్రం చేసుకోలేని స్థితిలో ఉంటే సంస్థ ప్రతినిధులు వారికి వ్యక్తిగత శుభ్రత చేయించి ఆదరిస్తున్నారు. నగర శివారులోని డాన్‌బాస్కో వీధి బాలల పాఠశాలలో సంస్థ ప్రతినిధులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లూరు డిప్యూటీ తహశీల్దార్ శివరాం వీధి బాలలకు భోజనం వడ్డించారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఫుట్ పాత్‌పై ఉన్న ఒక అనాథకు హెయిర్ కటింగ్, స్నానం చేయించి కొత్త దుస్తులు ధరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి వైద్యుల చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంస్థ ప్రతినిధులు పకీర, భాస్కర్, జుబేర్, వాహిద్, అశోక్, లోకేష్, మద్దిలేటి, భాను, శేఖర్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో అనాథకు కట్టింగు చేస్తున్న దృశ్యం

ముస్లింల అభ్యున్నతే టిడిపి లక్ష్యం

వక్ఫ్ చట్ట సవరణపై అభ్యంతరాలు నివేదించాం

చంద్రబాబు నాయుడు సూచనతోనేజెపిసి- మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ హుస్సేన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముస్లింల అభ్యున్నతి టిడిపి లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని టిడిపి మైనార్టీ నాయకులు వాహిద్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆగిపోగు ప్రభాకర్ తో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ... వక్ఫ్ చట్ట సవరణకు కేంద్ర ప్రభుత్వం పూనుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో ముస్లింలకు అనేక అనుమానాలు భయాందోళనలు నెలకొన్నాయన్నారు. వక్ఫ్ బోర్డు ఏర్పడిన నాటి నుంచి దాని అసలు లక్ష్యం పక్కదారి పట్టింది అన్న నెపంతో కేంద్ర ప్రభుత్వం ఈ విధానానికి తెరతీసిందన్నారు. దీని పేరు చెప్పి వక్ఫ్‌బోర్డును రద్దు చేయడం లేదా సవరణ పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై ముస్లిం సమాజానికి అనేక అభ్యంతరాలు ఉన్నాయని, దాన్ని సామరస్యంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి తెలిపారు. దానికోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) అవసరమని కేంద్ర ప్రభుత్వానికి నివేదించారని దానికి అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం జెపిసిని ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో పలు పార్టీల ముస్లిం నేతలను, ప్రజా ప్రతినిధులను మాజీ ప్రజా ప్రతినిధులను ఈ కమిటీలో సభ్యులుగా చేర్చిందన్నారు. ఇటీవలే ముస్లింల అభ్యంతరాలను, అనుమానాలను జెపిసి తమ పార్టీ తరపున రాతపూర్వక నివేదికతో పాటు ప్రత్యక్షంగా పలు అభ్యంతరాలను ఆ కమిటీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సైబర్ నేరాలు కొల్లలుగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు ,బిసిసెల్ జిల్లా అధ్యక్షులు సత్రం రామకృష్ణ, మైనార్టీ నాయకురాలు వాహిదా, పోతులరవి, హనుమంతరాయ చౌదరి పాల్గొన్నారు.

విలీన ప్రక్రియపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి-మద్దికేర : పాఠశాలల విలీన ప్రక్రియను వచ్చే అకాడమిక్ సంవత్సరం నుంచి రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం.రంగన్న తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు రకాల పాఠశాలల విధానాన్ని తొలగించి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా మాత్రమే కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు విద్యాశాఖ మంత్రి తెలియజేయడం హర్షణీయమని అన్నారు. జిఒ 117 వెంటనే రద్దుచేసి, ప్రాథమిక విద్యను బలోపేతం చేయుటకు చర్యలు చేపట్టాలని సూచించారు. యుటిఎఫ్ మండల ప్రెసిడెంట్ ఎంజి.నాగరాజు, అరుణ్ కుమార్, విశ్వనాథ్ లు పాల్గొన్నారు.

టమోటా అదరహో

100 కిలోలకు 4500

ప్రజాశక్తి-పత్తికొండ : పత్తికొండ వ్యవసాయ మార్కెట్లోని టమోటా ధరలు రోజురోజుకు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం టమోటా వేలం పాట లో 100 కిలోల టమోట రూ.4500 ధర పలికింది. మార్కెట్ సెక్రెటరీ కార్నోలీస్ మాట్లాడుతూ టమోటా 755 క్వింటాలు మార్కెట్ కు వచ్చినట్లు తెలిపారు. గరిష్టం 4500, మధ్య ధర 3300, కనిష్ట ధర 2600 కొనుగోలు చేస్తున్నారని అన్నారు. మార్కెట్ లోని టమోటా క్రయవిక్రయాలు విషయంలో ఏవైనా అక్రమాలు జరిగినట్లయితే మా దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు.

వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థను యధావిధిగా కొనసాగించాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడుకె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో గ్రామ వార్డు సచివాలయ వాలంటీర్లు ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు మాట్లాడుతూ వాలంటీర్లకుపెండింగులో ఉన్న జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. పదివేల వేతనం ఇచ్చి యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు

మంత్రి టిజి. భరత్‌ను కలిసిన డి.రామాంజనేయులు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్‌ను ఎపి సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నెసుబ్బారెడ్డిని, పాణ్యం నియోజవర్గం కల్లూరు మండలం, రామాంజనేయులు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందుకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఐటిడిపి పాణ్యం నియోజకవర్గ ప్రెసిడెంట్ వెంకటరమణ, ఐటిడిపి సోమశేఖర్ నాయుడు, రవి ,సుంకన్న ,హరి పాల్గొన్నారు.



బాధితులనుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 24 అర్జీలు వచ్చాయి. వాటన్నింటినీ త్వరితగతిన గడువులోపు పరిష్కారించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి. కష్ణ, ఆరోగ్యధికారి డాక్టర్ వి.విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఎస్ఇజి.రాజశేఖర్, ఆర్ఓ జునైద్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఒసత్యనారాయణ, టిపిఆర్ఒఇ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, డిపిఓ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

విలువిద్య క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

విలువిద్య క్రీడా ఏకాగ్రతను పెంచుతుంది

స్కూల్ గేమ్స్ విలువిద్య పోటీలను ప్రారంభించిన డాక్టర్ శంకర శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంపొందించేందుకు విలువిద్య ఎంతో ఉపయోగపడుతుందని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటుచేసిన విలువిద్య క్రీడా పోటీలను డాక్టర్ శంకర్‌శర్మ ప్రారంభించారు. జిల్లా విలువిద్య క్రీడా సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య, వంశీ, రాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ మన దేశ సాంప్రదాయ క్రీడా అయిన విలువిద్య ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. పురాణాల్లో అర్జునుడు చేప కంటిని నీటిలో చూస్తూ విల్లును సంధించిన ఉదంతాన్ని ఆయన వివరిస్తూ విలువిద్య ఏకాగ్రతను ఎంతో పెంచుతుందని తెలిపారు. ఈ క్రీడను బాలికలు కూడా సాధన చేయడం అభినందనీయమని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.ఈ క్రీడను సాధన చేసే క్రీడాకారులు మిగతా విషయాలపై దృష్టి సారించకుండా కేవలం లక్ష్యంపైనే దృష్టి సారించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని దేశ భవిష్యత్తు నేటి చిన్నారులపైనే ఆధారపడి ఉందని తెలిపారు. కర్నూలు నగరంలో విలువిద్య క్రీడలను ప్రోత్సహిస్తున్న నాగరత్నమయ్యను అభినందించారు. క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని వెల్లడించారు.

స్పందనలో ప్రతి వినతికి పరిష్కారం

ప్రజాశక్తి-సి బెళగల్

స్పందనలో వచ్చిన ప్రతి వినతికి పరిస్కారం అయ్యేలా చర్యలు తీసు కుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తహ సీల్దార్ కార్యాలయంలో స్పందన నిర్వహించగా ఇందుకు ఆరు వినతులు చేరుకున్నట్లు తెలిపారు. తిమ్మందొడ్డి గొల్ల వెంకటేష్ సర్వే 186 బి లోని భూమి గొల్ల రమేష్ పేరు మీద ఉండటమేమని తహసీల్దార్‌ను అడిగారు. రీ సర్వేలో తప్పులు దొర్లాయని న్యాయం చేయాలంటూ తహసీల్దార్‌ను మరో ఐదుగురు రైతులు చెప్పారు.



వినతులు స్వీకరిస్తున్న తహశీల్లాదర్ శ్రీనివాసరెడ్డి

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

జిల్లా పశ్చిమ ప్రాంత రైతులను ఆదుకొనేందుకు పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పత్తికొండ నియోజకవర్గ పర్యటనలో భాగంగా పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోన రిజర్వాయర్‌తో పాటు హంద్రీనీవా కాలువకు తూము ఏర్పాటు చేస్తానని ఆలూరు నియోజకవర్గ రైతులకు స్పష్టమైన హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలవుతున్నా ముఖ్యమంత్రి పింఛన్ల పంపిణీలో పాల్గొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 100 రోజుల్లో పింఛను తప్ప చేసిన అభివృద్ధి పనులేవీ లేవని విమర్శించారు. ఆలూరు నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయని, నియోజకవర్గ అభివృద్ధిపై వివక్ష చూపకుండా నిధులు మంజూరు చేయాలని కోరారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించాలని, 2023 రబీలో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కువ శాతం టమోటా పంట సాగు చేసుకుంటున్నారని తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం టమోటా జ్యూష్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి స్పష్టమైన హామీఇచ్చి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారునికి ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆలూరు

క్రీడకారుడు మధును సన్మానిస్తున్న ప్రిన్సిపల్ కెంజెడప్ప

సెపక్ తక్ర క్రీడాకారుడు కె.మధును ఘనంగా సన్మానించారు. సోమవారం ఆలూరు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెంజెడప్ప, తండ్రి బసవరాజు, సెపక్ తక్ర గురువు హనుమంతు రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు కవిరాజు, సరోజలు శాలువా వేసి కురువ మధును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కెంజెడప్ప మాట్లాడారు. సెప్టెంబర్ 18 నుంచి 23 వరకు జరిగిన ఆసియా బీచ్ సెపక్ తక్ర ఛాంపియన్ షిప్-2024లో పురుషుల ఇండియా జట్టుకు మధు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించారని తెలిపారు. టాలెంట్ ఎవరీ సొత్తు కాదని, మధ్యతరగతి కుటుంబంలో నుంచి వచ్చి చదువుతూ క్రీడలో అంచెలంచెలుగా ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో ఆడి కాంస్య పతకం సాధించిన మధు తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థి కావడం సంతోషించదగ్గ విషయమన్నారు. సెపక్ తక్ర క్రీడ గురువు హనుమంతురెడ్డి మాట్లాడుతూ... తాను నేర్పించిన సెపక్ తక్ర క్రీడతో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన శిష్యుడు మధును చూసి గర్విస్తున్నానని తెలిపారు. ఒక గురువుకు ఇంతకంటే ఏం కావాలని ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించిన క్రీడాకారుడు మధును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రిన్సిపల్ కెంజెడప్ప క్రీడాకారునికి ఆర్థిక సహాయం కింద రూ.5,016 చెక్కును అందజేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ స్రవంతి

ప్రజాశక్తి - నందవరం

నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ స్రవంతి ఫర్టిలైజర్ షాపు యజమానులను హెచ్చరించారు. సోమవారం నాగలదిన్నె గ్రామం శివాకిరణ్, నవీన్ ఫర్టిలైజర్, వెంకటేశ్వర, శ్రీనివాస ఫర్టిలైజర్ ఎరువు, పురుగు మందు దుకాణాల్లో తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఇన్వాయిస్‌లను పరిశీలించారు. రైతు తీసుకున్న ప్రతి ఎరువు, పురుగు మందుకూ సంబంధించిన బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. అనంతరం వారు పంట పొలాలను సందర్శించి, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మున్సిపల్ కౌన్సిల్‌లో రగడ

- వైస్ ఛైర్మన్లకు ప్రత్యేక కుర్చీ తొలగింపుపై బైఠాయింపు - కంట తడి పెట్టిన మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రగడ నెలకొంది. మున్సిపల్ వైస్ ఛైర్మన్లకు కౌన్సిల్ హాలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీలను తొలగించడంతో ఛైర్మన్‌తో వైసిపి కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. కౌన్సిల్ హాలులో ప్రత్యేకంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్లకు కుర్చీలు ఏర్పాటు చేయడం అనాదిగా వస్తోందని, ఉన్నపలంగా ఎందుకు తొలగించారని వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రఘునాథరెడ్డి, ఫయాజ్, ఇంతియాజ్, అశోక్, చలపతిలు పోడియం వద్దకు వెళ్లి ఛైర్మన్ శాంతతో వాగ్వాదానికి దిగారు. అంతకుముందు ఛైర్మన్ ఆదేశాల మేరకే కుర్చీలు తొలగించి కౌన్సిలర్ల వరుసలో వేశామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ చెప్పడంతో ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన కౌన్సిలర్లు ఆయనపై ధ్వజమెత్తారు. వైసిపి కౌన్సిలర్ల సహకారంతోనే ఛైర్మన్‌గా కొనసాగుతున్న సంగతి మరిచారా అంటూ ఛైర్మన్ శాంతను కౌన్సిలర్లు మూకుమ్మడిగా నిలదీశారు. మూడేళ్లుగా వస్తున్న సాంప్రదాయాన్ని ఎవరి ప్రోద్బలంతో కుర్చీలు తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతలోనే హాలులోకి చేరుకున్న ఎమ్మెల్యే పార్థసారథి వారి రగడను చూస్తూ ఉండిపోయారు. 1వ వార్డు టిడిపి కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... వార్డులో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం జరగాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎమ్మెల్సీ మధుసూదన్ విజ్ఞప్తి మేరకు మరోసారి వైస్ ఛైర్మన్ల కుర్చీలు మార్పు జరగదని చెప్పడంతో కౌన్సిలర్లు కూర్చోవడంతో కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. అన్న క్యాంటీన్లు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం నిలిచిపోవడం, వాగుల్లో, వంకల్లో పూడిక తొలగింపు అంశాలపై వాడివేడిగా చర్చ సాగింది. కౌన్సిలర్ లలిత మాట్లాడుతూ... వైసిపిలో అవమానం జరగడంతోనే బిజెపిలో చేరామని తెలిపారు. తమను రాజీనామా చేయాలని కోరడం టిడిపి నాయకులకు తగదని అభ్యంతరం చెప్పారు. అనవసరంగా టిడిపి నాయకులపై నోరు పారేసుకోవద్దని అక్కడే ఉన్న టిడిపి కౌన్సిలర్ పార్వతి ఆమెను నిలదీశారు. అన్న క్యాంటీన్లకు మరమ్మతుల చేసిన బిల్లు మొత్తానికి వైసిపి కౌన్సిలర్లు ఆమోదం తెలపడంతో ఎమ్మెల్యే పార్థసారథి అభ్యంతరం చెప్పారు. ప్రజాధనంతో నిర్మించిన అన్న క్యాంటీన్ల నాణ్యతను పరిశీలించిన తర్వాతే ఆమోదం తెలపాలని కౌన్సిలర్లకు విజ్ఞప్తి చేశారు. ఆరు నెలలుగా మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు కాంట్రాక్టర్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఎందుకు ఆగిపోయాయో కాంట్రాక్టర్‌తో మాట్లాడాలని అధికారులకు కోరారు. నిర్మించిన దానికి బిల్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... పూడిక తొలగింపు కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయని, వాటికి ఆమోదం తెలపాలని కోరారు. దీనికి వైసిపి కౌన్సిలర్లు సమాధానం చెప్పకుండానే సభ ముగిసింది.

ఎమ్మెల్యే ముందు బైఠాయించిన వైసిపి కౌన్సిలర్లు

దళితుడని అవమానించారు

వైస్ ఛైర్మన్‌గా దళితుడు ముందు వరుసలో కూర్చోవడం చూసి జీర్ణించుకోలేకనే కుర్చీ తొలగింపు ప్రక్రియకు పాల్పడ్డారని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లుగా కొనసాగిన సాంప్రదాయాన్ని ఉన్నపలంగా తొలగించడం చూస్తుంటే తమను అవమానపరిచే దిశగా ఈ ప్రయత్నం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లు నోరు తెరవని ఛైర్మన్ ఎమ్మెల్యే పార్థసారథి అండ చూసుకొని వైసిపి కౌన్సిలర్ల పట్ల చులకనగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

కంట తడి పెట్టిన ఛైర్మన్

శంకుస్థాపన శిలాఫలకాల్లో పేరును తొలగించి అవమాన పరుస్తున్నారని కౌన్సిల్‌లో ఛైర్మన్ శాంత కంటతడి పెట్టారు. తాను పార్టీ మారలేదని, వైసిపిలోనే ఉన్నానని తెలిపారు. కొందరు పనిగట్టుకొని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. శిలాఫలకాల్లో ఆమె పేరును పొందుపరిచేలా చూడాలని కౌన్సిలర్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లు లోకేశ్వరి, కీర్తన, నాగరత్న, లక్ష్మి, బాలాజీ, ఇంతియాజ్, వసీం, ఉస్మాన్, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇంతియాజ్, డిప్యూటీ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి, గోపీనాథ్ వర్మ, టిపిఆర్ఒ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి, నాగరాజు ఉన్నారు.

ఛైర్మన్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పట్టుకుంటారు.. పక్కన పడేస్తారు..!

- పోలీసు స్టేషన్లలో తుప్ప పడుతున్న వాహనాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఏ పోలీసు స్టేషన్‌కి వెళ్లినా.. అక్కడ కొన్ని బైకులు, కార్లు, ఆటోలు లాంటివి పార్కు చేసి ఉంటాయి. వాటన్నింటినీ ఓ పెద్ద గొలుసుతో కట్టి తాళం కూడా వేసి ఉండడాన్ని గమనించే ఉంటారు. ఇలా ప్రతి పోలీసు స్టేషన్ ముందు ఇలాంటి వాహనాలు ఎన్నో కనిపిస్తాయి. అవి కొన్నేళ్ల తరబడి అక్కడే వదిలేసిన వాహనాలు. వివిధ కారణాలతో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు.

సాధారణంగా ఏదైనా ఒక కేసులో వాహనాన్ని సీజ్ చేసినప్పుడు కొన్ని వాహనాలను విడిపించుకుంటారు. అలా సీజైన వాహనాల్లో మరి కొన్ని ఏళ్ల తరబడి పలు కేసుల కారణంగా పోలీసు స్టేషన్‌లోనే ఉండిపోతాయి. ఇంకా ఏళ్ల తరబడి అవి నిరుపయోగంగా ఉండడంతో రోడ్డుపై నడపటానికి వీలు కానీ విధంగా మారతాయి. పలు కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలు పోలీసు స్టేషన్‌లో, ఎక్సైజ్ స్టేషన్‌లో, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఏళ్ల తరబడి మగ్గుతున్నాయి. దొంగతనాలకు గురైనవి, రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్నవి, అక్రమ రవాణా కేసులో పట్టుబడినవి, సరైన పత్రాలు లేకుండా సీజ్ చేసిన వాహనాలు పలు పోలీసు స్టేషన్లలో తప్పు పడుతున్నాయి.

అందులో ఏ వాహనాలు స్క్రాప్, ఏ వాహనాలు రోడ్డు మీద నడిపేందుకు అనువుగా ఉన్నాయనేది ఆర్‌టిఎ అధికారులు పరిశీలించి నిర్ణయిస్తారు. ప్రభుత్వం వాటికి బహిరంగంగా వేలం వేస్తోంది. అదేదో స్క్రాపే కదా అని కొట్టి పారేయకండి. ఆ స్క్రాప్ వెహికిల్స్ అమ్మడం ద్వారా ప్రభుత్వం రూ.కోట్ల ఆదాయాన్ని గడిస్తుందంటే నమ్మగలరా..? ఉన్నతాధికారులు స్పందించి పలు వాహనాలను వేలం పాట నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.

స్క్రాప్ వాహనాలను అమ్మాలంటే నిబంధనలు

ఒక వాహనం సీజ్ చేసినప్పుడు సుమారు 4, 5 ఏళ్ల వరకు దాన్ని ఎవరూ విడిపించుకోకుంటే వాటి గురించి ముందుగా దినపత్రికల్లో ప్రకటన ఇస్తారు. ప్రభుత్వం వేలం వేయదలుచుకున్న వాహనాల్లో మీ వాహనం ఉందంటే సంబంధిత పత్రాలతో పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఆధారాలు చూపించి వాహనం తీసుకోవాలని ప్రకటన ఇస్తారు. అలా ప్రకటన ఇచ్చినప్పటి నుంచి సుమారు 6 నెలల గడువులోపు వాహన యజమాని వాహనాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. అలా రాకుంటే 6 నెలల తర్వాత ఆ వాహనాలను ఎప్పుడు, ఎక్కడ వేలం వేస్తున్నారో, ఎన్ని వాహనాలు ఉన్నాయో అనే వివరాలతో మరో ప్రకటన ఇస్తారు. ఆర్‌టిఎ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా ఏయే వాహనానికి ఎంత ధర అనేది నిర్ణయించి వేలం పాట పాడతారు.

పోలీసు స్టేషన్‌లో తుప్ప పడుతున్న వాహనాలు

కళాశాల అధ్యాపకులతో ఉన్న క్రీడాకారుడు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - చిప్పగిరి

సెప్టెంబర్ 25న కర్నూలులో జరిగిన అండర్-19 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సీనియర్ ఎంపిసి విద్యార్థి ఎం.అఖిల్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ పి.వరదరాజులు మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. క్రీడలతో శారీరక దృఢత్వం, అన్ని రకాల పరిచయాలు, చురుకుదనంతో ఆరోగ్యంగా తయారవుతారని చెప్పారు. క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి పేరు, ప్రతిష్టలు వస్తాయన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జ్ పీడీ సుధీర్, మండల యువత, కళాశాల సిబ్బంది అభినందించారు.

హాలహర్వి మండలంలో విఆర్‌ఒలకు బదిలీలు లేవా : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు నియోజకవర్గంలోని హాలహర్వి మండలంలో విఆర్‌ఒలకు బదిలీలు లేవా అని సిపిఎం తాలూకా నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల నాయకులు కృష్ణ ప్రశ్నించారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా రెవెన్యూ విభాగంలో అందరినీ బదిలీ చేస్తే హాలహర్వి మండలంలో విఆర్‌ఒలకు మాత్రం ఎందుకు వర్తించడం లేదని ప్రశ్నించారు. హాలహర్వి మండలంలో ఐదేళ్లు గడుస్తున్నా బదిలీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటో తెలియడం లేదన్నారు. బదిలీల విషయంలో అవకతవకలు, పైరవీలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అధికార పార్టీ నాయకులు వారికి కావాల్సిన వారినే వేసుకుంటున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు.

గ్రామీణ విద్యార్థికి ఎంబిబిఎస్ సీటు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని పార్లపల్లె గ్రామానికి చెందిన చెవ్వ అపర్ణ ఎంబిబిఎస్ సీటు సాధించారు. గ్రామానికి చెందిన చెవ్వ మంజునాథ్ రెడ్డి, చెవ్వ కృష్ణవేణిల కుమార్తె చెవ్వ అపర్ణ 2024 నీట్ పరీక్షల్లో 632 మార్కులు సాధించారు. మెడికల్ కళాశాలల సీట్ల కేటాయింపులో భాగంగా చెవ్వ అపర్ణకు కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు లభించింది. అపర్ణకు సీటు రావడం పట్ల సోమవారం గ్రామంలోని పెద్దలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరు : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో రబీ పంటలకు సంబంధించి రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఎఒ జయలక్ష్మి తెలిపారు. సోమవారం చిప్పగిరిలోని రైతు సేవా కేంద్రంలో ఆమె మాట్లాడారు. మండలానికి 4,450 క్వింటాళ్ల శనగ విత్తనాలను మంజూరు చేసిందన్నారు. శనగ విత్తనాలు క్వింటా రూ.9,400 ఉండగా ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో రూ.7,050లకు రైతులకు పంపిణీ చేస్తోందన్నారు. ఇతర వివరాల కోసం దగ్గరలో ఉన్న రైతు సేవ కేంద్రాలను, గ్రామ వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. **హాలహర్వి** మండలానికి 3,250 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయినట్లు ఎఒ శివశంకర్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి దేవనకొండ

దేవనకొండలో మౌలిక వసతుల నిర్వహణ లోపంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎమ్.నరసారావు, మండల నాయకులు వై.కండప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఎంపిడిఒ గౌరీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మేజర్ పంచాయతీలో 14 వార్డులు ఉన్నప్పటికీ చాలా వార్డుల్లో డ్రెయినేజీ కాలువలు లేక రోడ్ల పైనే మురుగునీరు ప్రవహించి దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. సిసి రోడ్లు లేకపోవడంతో వర్షాలు వస్తే రోడ్లన్నీ జలమయమై కాలనీ ప్రజలు నడవలేని పరిస్థితి ఉంటుందని చెప్పారు. కొన్ని కాలనీల్లో వీధిలైట్లు లేక రాత్రి సమయంలో వీధి కుక్కల బెడద, విష సర్పాలు సంచరించడం వల్ల వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి వి.రాజశేఖర్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రామాంజి, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, సిపిఐ నాయకులు నాగన్న, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆల్ఫ్రెడ్ రాజుకు సన్మానం

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల ఆల్ఫ్రెడ్ రాజును కర్ణాటకకు చెందిన విప్రభాంధవ శ్రీనివాస కల్యాణ సేవా సమితి, సప్త రుషి సౌహారద పత్తిన సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక శ్రీమఠం ఆవరణలోని శ్రీమధ్వ మార్గ కారిడార్ ఆవరణంలో ఆయనకు శాలువా, జ్ఞాపకలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సంస్థల డైరెక్టర్ గురురాజ రావు మాట్లాడారు. మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు గత 27 ఏళ్లుగా స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆయన చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయంతో కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు పట్టణంలో సొసైటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం సొసైటీలో సుమారు 6 వేల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఈ సొసైటీ ద్వారా రుణాలు అందించి ఎంతో మందికి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు శ్యామల, సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ విజయోత్సవ కార్యక్రమానికి అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్ల రాలేదని, తానే ఇక్కడికొచ్చి సన్మానించినట్లు తెలిపారు. సన్మాన గ్రహీత ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ... విప్రబాంధవ శ్రీనివాస కల్యాణ సేవా సమితి, సప్త రుషి సౌహారద పత్తిన సహకార సంఘం సంయుక్తంగా చేసిన సన్మానం తమ స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసేందని తెలిపారు. సిల్వర్ జూబ్లీ విజయోత్సవ సభకు వెళ్లి ఉంటే మైసూర్ మహారాజు చేతుల మీదుగా అందుకునే వాడనని చెప్పారు. ఆయన కూడా సొసైటీ డైరెక్టర్ గురురాజ రావుకు శాలువా, పండ్లు అందజేసి సన్మానించారు. శంకర్, సతీష్ ఉన్నారు.



ఆల్ఫ్రెడ్ రాజును సన్మానిస్తున్న సభ్యులు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు హత్తి బెళగల్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఆలూరు

హత్తిబెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సెపక్ తక్ర క్రీడ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21 కర్నూలు స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో ఎఫ్.రియాజ్, పి.రియాజ్, అండర్-17 బాలికల విభాగంలో బి.మానస, అండర్-14 బాలుర విభాగంలో కె.వరుణ్ కుమార్, పి.మౌలా హుస్సేన్ ఎంపికైనట్లు చెప్పారు. వీరిని ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, ఉపాధ్యాయులు ఖాసీం వలీ, చంద్రశేఖర్ నాయుడు, ఉషారాణి, శంకరయ్య, నరహరి, బసవరాజు, వ్యాయమ ఉపాధ్యాయులు చిన్నబాబు అభినందించారు.

పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ

మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

బనవాసి గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు షెడ్యూల్ కులాలకు పొద్దుతిరుగుడు విత్తనాలను సోమవారం ఉచితంగా అందజేశారు. కెవికె కోఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్ రాధ కుమారి, డాక్టర్ వెంకట రమణమ్మ, డాక్టర్ రవి ప్రకాష్ రెడ్డి, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ చందన, డాక్టర్ మౌనిక, డాక్టర్ నిరంజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో పొద్దుతిరుగుడు విత్తనాలు వేసే రైతులు తక్కువ ఉన్నారని తెలిపారు. షెడ్యూలు కులాలకు టార్పాలిన్లు, గడ్డపార, కొడవలి ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు.

లాడ్జీల నిర్వాహకులపై ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని ప్రయివేట్ లాడ్జీల నిర్వాహకులపై భక్తులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట్ సమీపంలో హరపనహల్లికి చెందిన ఆర్మీలో పని చేస్తున్న నవీన్ కుమార్ తన స్నేహితులతో కలిసి రాఘవేంద్రస్వామి దర్శనార్థమై ఆదివారం మంత్రాలయం వచ్చారు. ఓ ప్రయివేట్ లాడ్జీలో గది అద్దెకు తీసుకుని మధ్యాహ్నం 2 గంటలకు ఖాళీ చేస్తామని లాడ్జీ నిర్వాహకునికి చెప్పి రూ.1200 ప్రకారం రెండు గదులు తీసుకొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఖాళీ చేయకపోవడంతో నిర్వాహకుడు వాగ్వాదానికి దిగారు. ఖాళీ చేసేందుకు 24 గంటలు వ్యవధి ఉంటుందని తెల్లవారుజామున వెళ్తామని చెప్పగా మరో రూ.వెయ్యి అదనంగా ఇవ్వాలని దురుసుగా మాట్లాడారు. భక్తులు పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఎస్ఐ పరమేష్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4న ఎమ్మిగనూరులో జాబ్ మేళా



కరపత్రం విడుదల చేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 4న ఎమ్మిగనూరులో ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ లేదా ఏదైనా డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగ యువత హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇఒఆర్‌డి నగేష్, కార్యాలయ ఎఒ బాబు భాస్కర్, ఈఎస్‌సి కోఆర్డినేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

కార్యకర్తలకు అన్యాయం జరిగితే.. ఎంతటి త్యాగానికైనా సిద్ధం...

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

కష్టకాలంలోనూ తనకు అండగా ఉన్న కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ఎంతటి త్యాగానికైనా సిద్ధమని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం ఆదోని నియోజకవర్గ సభ్యత్వం నమోదుపై టిడిపి కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి కుటుంబ సభ్యులందరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. 40 ఏళ్లుగా టిడిపి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. పార్టీ గెలుపు కోసం ఎంతో కృషి చేశారని, అలాంటి నాయకులు, కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేందుకు సహాయం చేస్తానని చెప్పారు. ఎలాంటి పదవులూ వద్దని, టిడిపి నాయకులు, కార్యకర్తల అండ ఉంటే చాలని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, యువ నాయకులు భూపాల్ చౌదరి, బుద్ధారెడ్డి, మారుతి నాయుడు, రంగన్న, రామస్వామి, బసవరాజు, ఉమ్మి సలీం, శ్రీకాంత్ రెడ్డి, దేవేంద్రప్ప, అప్సర్ బాష, తిమ్మప్ప, మురళీ, మాజీ కౌన్సిలర్ రంగన్న, శివప్ప, రామకృష్ణ, శ్రీనివాసచారి, లక్ష్మీనారాయణ, వెంకటేష్ చౌదరి, రవి ఉన్నారు.

పేద అనాథ బాలుర సంరక్షణ కేంద్రానికి నిత్యావసర సరుకులు, ఫ్యాన్ అందజేత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పేద అనాథ బాలుర సంరక్షణ కేంద్రానికి పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, ఫ్యాన్ అందజేశారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రేఖ గౌడ్ పిలుపుమేరకు జనసేన పార్టీ నాయకులు బోయ రామకృష్ణ, లక్ష్మన్న ఆధ్వర్యంలో బాలుర సంరక్షణ కేంద్రంలో ప్రతి సోమవారమూ భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నిత్యావసర సరుకులు, ఫ్యాన్‌ను సొసైటీ అధ్యక్షులు నరసన్నకు అందజేశారు. జనసేన నాయకులు బోయ రామకృష్ణ, లక్ష్మన్నకు సొసైటీ సభ్యులు నరసన్న, మిథున్ చక్రవర్తి, రవి, రంగస్వామిలు శాలువా కప్పి పండ్లు అందజేశారు. జనసేన కార్యకర్తలు షబ్బీర్, ఖాజా, జావిద్, మహబూబ్, వినోద్ కుమార్, మహేష్, ఈరన్న, కమిటీ సభ్యులు నాగరాజు, యువరాజు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న నాయకులు